వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# బద్వేలులో నీటి కష్టాలు

4లో

# పవనసుతుడికి ప్రత్యేక పూజలు

## పోలీసులు కొందరిని ఊరు వదిలి వెళ్లాలని నోటీసులు ఇవ్వడం దారుణం

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 1, ప్రభాతవార్త: పోలీసులు కొందరిని ఊరు వదిలి వెళ్లాలని నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రొద్దుటూరు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల రాజులరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏ పార్టీ వారినైనా పోలీసులు పిలిపించి హెచ్చరికలు జారీ చేయడం లేక వారిని కౌంటింగ్ జరిగే సమయంలో పోలీసుల వద్ద ఉంచుకోవడం చేయాలి. పోలలీసులు చెప్పిన తరువాత కూడా ప్రొద్దుటూరు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు అఘాయిత్యపు చర్యలకు పాల్పడరని అనుకుంటున్నా అన్నారు. వేరే ప్రాంతాల వారు ఊరు వదిలి వెళ్లాలంటే ఎక్కడికి వెళ్తారు. అన్ని ప్రాంతాల్లో ఎన్నికల కౌంటింగ్ జరుగుతోంది కదా అన్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ, డీఐజీతో మాట్లాడతానని ఆయన తెలిపారు.



## ఘనంగా హనుమాన్ జయంతి
### - అలరించిన చెక్కభజనలు, కోలాటాలు
### - పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు



చిట్వేలి, జూన్ 1, ప్రభాతవార్త:
చిట్వేలి మండల పరిధిలో పలు చోట్ల హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. రాజుకుంట క్రాస్ వద్ద చెర్లోపల్లె రహదారి వద్ద, దత్తగిరి నారాయణ స్వామి తపోవనం వద్ద, చిట్వేలి బ్రాహ్మణ వీధి, తిమ్మయ్యగారిపల్లి తదితర శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాల వద్ద ఈ వేడుకలను పెద్దఎత్తున నిర్వహించారు. దేవాలయాలను ప్రత్యేక విద్యుత్తు దీపాలంకరణలతో చలువ పందిళ్లతో అలరించారు. వివిధ పూలతో ఆభరణాలతో మూల విగ్రహాలను అర్చకులు అలంకరణ గావించగా వేకువజామునుంచే వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, అర్చనలు హరేరామ భజనలు, కోలాటాలు, చెక్క భజనలు, పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి చోట్ల మిన్నంటాయి. అల్పాహారం, మధ్యాహ్నం భోజనాలను అన్ని చోట్ల ఆలయ కమిటీ సభ్యులు పెద్దఎత్తున నిర్వహించారు. కార్యక్రమంలో యువత, మహిళలు, భక్తులు స్థానిక గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి
### - ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ పూర్తి చేయాలి
### - జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అభిషిక్ట్ కిశోర్



రాయచోటి, జూన్ 1, ప్రభాతవార్త: కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, అభిషిక్స్ కిశోర్ అధికారులకు సూచించారు. శనివారం రాయచోటిలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ జరిగే ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో బారికేడ్లు పటిష్టంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 12 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని ఒక్కో హాలులో 14 టేబుళ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి టేబుల్‌కు ఒక ఏఆర్ఓ, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. ఈవీఎం కౌంటింగ్ సంబంధించి టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది ఉంటారని ఇందులో ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సత్యనారాయణ, ఆర్డీవో రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రాజంపేటలో ఈదురు గాలుల విధ్వంసం

- ప్రధాన రహదారులపై నేలకూలిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు..
- విద్యుత్ సరఫరా నిలిచిపోయి జనం కష్టాలు
- తొలకరి పలకరించిన రోజే జనానికిఅగచాట్లు



రాంనగర్ లో రోడ్డుపై అడ్డంగా నేల కూలిన వృక్షాలు



చక్రాల మడుగు బ్రిడ్జిపై నేల కూలిన విద్యుత్ స్తంభాలు

రాజంపేట అర్బన్, జూన్1 ప్రభాతవార్త రుతుపవనాల ప్రభావంతో తొలకరి పలకరించిన రోజే ప్రజలకు కష్టాలు తప్పలేదు. వర్షం పడింది కొద్దిసేపు అయినా ఈదురుగాళ్లు విధ్వంసం సృష్టించాయి. పళ్ళతోటలు భారీగా నేలకూలాయి. దశాబ్దాల వయసు కలిగిన వృక్షాలు కూకటి వేళ్ళతో సహా నేల కులాయి . విద్యుత్ అధికారుల కంటే ముందే పలుచోట్ల యువత రంగంలోకి దిగి చెట్లను నరికి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. రాజంపేట చిట్వేల్ రోడ్లు రాంనగర్లో స్థానిక యువత ఈదురు గాలులు నిలిచిపోయిన వెంటనే రంగంలోకి దిగి విద్యుత్ వైర్లను పక్కకు తీసివేసి, రోడ్డుపై పడిన వృక్షాలను నరికి వేశారు. జెండామాను వీధిలో కూడా నేలకూలడంతో యువత స్పందించి ప్రజలకు ఇబ్బంది లేకుండా కొమ్మలు తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. మున్నూరు బైపాస్ రోడ్డు ఓ దుకాణం రేకులు ఈదురుగాలిలో తాకిడికి ఎగిరిపడి ప్రధాన రహదారిలోని విద్యుత్ లైన్ పై పడ్డాయి. అన్ని ప్రాంతాలలో పెద్ద ఎత్తున విద్యుత్ విద్యుత్ స్తంభాలు ,చెట్లు పడిపోవడంతో విద్యుత్ ఉద్యోగులకు సరఫరా పునరుద్ధరించడం సాధ్యం కాలేదు. గ్రామీణ ప్రాంతాలు అంధకారంలోకి వెళ్లాయి. విద్యుత్ సరఫరా ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడిందని విద్యుత్ ఉద్యోగులు ఫోన్లలో సమాధానం ఇచ్చారు. ఏది ఏమైనా పలకరించిన రోజే జనానికి కష్టాలు తప్పలేదు. వాతావరణం చల్లగా మారింది. ఎండ నుంచి ఉపశమనం లభించింది.



రాజంపేట పట్టణం జాతీయ రహదారిలో మన్నూరు వద్ద ప్రధాన రహదారిలోవిద్యుత్ వైర్లు తాగిన రేకులు !

# మూడంచెల భద్రత

### జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తో కలిసి.. కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు



కడప, జూన్ 1 :
పటిష్టమైన భద్రతా బలగాల మధ్య.. కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. శనివారం కడప రిమ్స్ సమీపంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు.. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్, జేసీ గణేష్ కుమార్, నగర కమిషన్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్.. కౌంటింగ్ కేంద్రంలో ఏయే ఫ్లోర్లలో ఏయే నియోజకవర్గ కౌంటింగ్ టేబుళ్లు, వాహనాల పార్కింగ్, కమ్యూనికేషన్ రూమ్, మీడియా కేంద్రం తదితరాల ఏర్పాటు స్థలాలను, సూచిక బోర్డులు ఏర్పాటు, కౌంటింగ్ హాలు లోకి ప్రవేశించేందుకు అధికారులు, సిబ్బంది, ఏజెంట్లకు విడివిడిగా బారికేడింగ్ ఏర్పాటు తదితరాలను పరిశీలించి.. సంబంధిత నోడల్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కౌంటింగ్ హాలులో ఓట్ల లెక్కింపు సజావుగా, సౌకర్యవంతంగా జరిగేలా సెటప్ చేయడం జరిగిందన్నారు. ఏ చిన్నపాటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా.. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సుధాకర్, అడిషనల్ ఎస్పీ కృష్ణారావు, కడప రిటర్నింగ్ అధికారి మధుసూదన్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎగ్జిట్ పోల్స్..! ఎగ్జాట్ పోల్సేనా..!!



ఎగ్జిట్ పోల్స్ ఓటరు నాడిని దగ్గరగా పట్టాయా? ప్రజాభిప్రాయం బయటపడిందా? ఓటర్ నాడీ దొరికిందా? ఓడేది ఎవరు? గెలిచేది ఎవరు? కడప గడపలో కాంగ్రెస్ ఖాతా తిరచడం అనుమానమేనా? రాజంపేట, కడప ఎంపీ సీట్లు వైసిపి గెలుస్తుందా? శనివారం వెలువడిన ఎగ్జిట్ పోల్స్ ఎగ్జాక్ట్ పోల్సేనా? మరో రెండు రోజుల్లో అసలు ఫలితాలు బయటపడనున్న నేపథ్యంలో ఎగ్జిట్ పోల్స్ పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బెట్టింగ్ కాచిన నేతలలో వణుకు ప్రారంభమైంది. టెన్షన్ మరింత పెరిగింది. కొన్ని సర్వే సంస్థలు ఏకంగా ఎక్కడ ఎవరు గెలుస్తారో చెప్పడం ఇందుకు ప్రధాన కారణం... రాజంపేట అర్బన్, జూన్1 ప్రభాతవార్త

- కడపగడపలో హెూరాహెూరి పోరు
- కాంగ్రెస్ ఖాతా తెరచడం అనుమానమే?
- జమ్మలమడుగులో సం'కుల' సమరం
- రాజంపేట, కడప ఎంపీ సీట్లు వైసీపీ కేనా?

ఉమ్మడి కడప జిల్లాలో అధికార వైకాపా, తెలుగుదేశం పార్టీ మధ్య పలు సెగ్మెంట్లలో హెూరాహెూరీ పోరు జరిగినట్లు తెలుస్తోంది. సీఎం సొంత జిల్లాలోనే పోలింగ్ ఏకపక్షంగా అధికార పార్టీకి జరగలేదని స్పష్టం అవుతోంది. ఎగ్జిట్ పోల్స్ అంచనా ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైయస్ షర్మిల ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేదు అని తెలుస్తోంది. అయితే కొన్ని నియోజకవర్గాలలో ఆమె ప్రభావంతో వైసిపి ఆశలు గల్లంతయ్యే అవకాశాలు లేకపోలేదు. వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు ఓట్ల కోసం పెద్ద ఎత్తున కోట్లాది రూపాయలు ఖర్చు చేసే విషయం తెలిసిందే. కొన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం వెనుకంజ వేసినా అధికార పార్టీకి ఏమాత్రం తగ్గలేదు. అలాగే జనసేన బిజెపి కూడా వైసిపి గట్టి పోటీ ఇచ్చినట్లు సమాచారం. ఇక కాంగ్రెస్ విషయానికొస్తే వైయస్ షర్మిల సొంత ఇమేజ్, వైయస్ వివేకానంద రెడ్డి రెడ్డి హత్య అనంతరం చోటు చేసుకున్న పరిణామాలు మాత్రమే కొంతవరకు దోహదం చేశాయన్నది ప్రాథమిక అంచనా. కాంగ్రెస్ పార్టీని చూసి ఓట్లు వేయలేదన్నది సర్వేలో వెలుగు చేసిన నిజం. ఫలితంగా ఆమెకు డిపాజిట్లు కూడా రావని ఓ సంస్థ పేర్కొనడం గమనార్హం. ఎగ్జిట్ పోల్స్ కు శాస్త్రీయత తక్కువే అయినా ప్రస్తుతం ఎన్నికల ఫలితాలు విలువడే ముందు ట్రెండ్ గా మారాయి. పోటీ నువ్వా నేనా అన్నట్లు జరిగిన నియోజకవర్గాలలో ఎగ్జిట్ పోల్స్ తర్వాత విజయం పై అభ్యర్థుల్లో ఆశలు రేకిస్తున్నాయి. కడప, రాజంపేట ఎంపీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు వైయస్ అవినాష్ రెడ్డి ,పీవీ మిథున్ రెడ్డి గెలుపు దాదాపు ఖాయమని మెజారిటీ సర్వే సంస్థలు ప్రకటించాయి. రాజంపేట బిజెపి ఎంపి అభ్యర్థి ,మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి తంబళ్లపల్లె ,రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాలలో ప్రతికూల పరిస్థితులు ఎదురైనట్లు కొన్ని సర్వే సంస్థలు చెబుతున్నాయి. అయితే రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే విషయంలో మెజార్టీ సర్వే సంస్థలు కూటమి కే మొగ్గు చూపుతున్న నేపథ్యంలో జిల్లాలో ఆ ప్రభావం వైసిపి పై పడే అవకాశాలు లేకపోలేదని తెలుస్తోంది. ఏది ఏమైనా రెండు రోజులు ఆగితే అసలు ఫలితాలు అభ్యర్థుల జాతకాలను నిర్ణయిస్తాయి.



# పాఠశాల నిర్వహణ గ్రాంట్‌ను సకాలంలో చెల్లించాలి: ఏపీయూఎస్

రాయచోటి, జూన్ 1, ప్రభాతవార్త:
అన్నమయ్య జిల్లా శాఖ అభ్యాస వర్గ కార్యక్రమం శనివారం రాయచోటిలోని స్థానిక వైవీ నాగిరెడ్డి డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా పాఠశాల నిర్వహణ గ్రాండ్‌ను విడుదల చేయకపోవడం వల్ల పాఠశాల నిర్వహణ చాలా కష్టతరంగా మారిందని తద్వారా నాణ్యమైన విద్య విద్యార్థులకు అందించడానికి ప్రభుత్వం ఆశించిన రీతిలోఅందదని అన్నారు. కావునా వెంటనే గత 2 సంవత్సరాల బకాయిలను అదే విధంగారాబోయే విద్యా సంవత్సరం యొక్క గ్రాంట్‌ను విడుదల చేసి పాఠశాలలు సజావుగా జరిగేలా ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షులు పరశురాం మరియు జిల్లా అధ్యక్షులు ఎం.నరసింహులు మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలను సకాలంలో పాఠశాల స్థాయికి చేరేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.నాగేశ్వరరావు మరియు దివాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన పాత బకాయిలను వెంటనే చెల్లిం చాలని తెలిపారు. జిల్లా




ప్రధాన కార్యదర్శి కె.రమణారెడ్డి మాట్లాడుతూ పదో తరగతి స్పాట్ వ్యాల్యుయేషన్ పెండింగ్‌లో ఉన్న అమౌంట్‌ను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి బాలాజీ, జిల్లా కోశాధికారి శివశంకర్, జిల్లా మీడియా ఇన్‌ఛార్జి కె.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యాలయ ప్రముఖులు ఎ.రెడ్డి ప్రసాద్, జిల్లా మహిళా కన్వీనర్ సుశీల, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణవేణి, కవిత, సేవా కన్వీనర్ మల్లయ్య, వివిధ మండలాల అధ్యక్షులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు అతిక్రమిస్తే క్రిమినల్ చర్యలు
## - డీఎస్పీ మోహన్ రావు



కలికిరి, జూన్ 1, ప్రభాతవార్త:
పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా రాజకీయ పార్టీ నాయకులు, ప్రజలు ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని ఎవరైనా అతిక్రమిస్తే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని పీలేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి డీఎస్పీ మోహన్‌రావు హెచ్చరించారు. శనివారం సాయంత్రం కలికిరి పోలీసు స్టేషన్ ఆవరణలో కలికిరి సీఐ మోహన్ అధ్యక్షతన వివిధ పార్టీ నాయకులతో ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు అనుసరించాలి అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మోహన్‌రావు మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఈనెల 4న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ జరుగుతుందన్నారు. ప్రతి పంచాయతీలోనూ 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. జూన్ 4వ తేదీన పార్టీ నాయకులు ప్రజలు మండల కేంద్రాలకు రాకూడదన్నారు. అదే విధంగా ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్దకు కూడా రావద్దన్నారు. గ్రామాల్లో నలుగురు కంటే ఎక్కువగా గుంపులుగా ఉండకూడదన్నారు. గ్రామాల్లో రాజకీయ నాయకులు, ప్రజలు తమ అభ్యర్థులు గెలిచారని బాణాసంచా కాల్చరాదన్నారు. ప్రతి ఒక్కరూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు అనుసరించి పోలీసులకు సహకరించాలన్నారు. కలికిరి సీఐ మోహన్ మోట్లాడుతూ గత నెల 13న జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు కలికిరి మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు వివిధపార్టీ నాయకులు పోలీసులకు సహకరించారని అందరికీ సీఐ కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా జూన్ 4వ తేదీ కూడా ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు అందరూ పాటించి కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దేవేంద్ర కుమార్, ఏఎస్సై మహబూబ్ బాషా, హెడ్ కానిస్టేబుళ్లు రాజేంద్రప్రసాద్, కొండప్ప, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కమలాపురం, ప్రొద్దుటూరు సబ్ జైలు విజిట్

కడప లీగల్, జూన్ 1, ప్రభాతవార్త: కమలాపురం, ప్రొద్దుటూరు సబ్ జైలును జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ మరియు ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారు విజిట్ చేశారు. ఈ సందర్భంగా జైలు పరిసరాలను, వసతి గదులను, వంట గదిని, టాయిలెట్లను, రిజిస్టర్లను పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం మరియు ప్రొద్దుటూరు సబ్ జైలు సూపర్ సూపరింటెండెంట్‌లు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# క్యాన్సర్ ప్రాణాంతకమైన వ్యాధి కాదు..

కడప కార్పొరేషన్, జూన్ 1, ప్రభాతవార్త:
నేటి జీవనశైలి మార్పులు కారణంగా అన్ని వయసుల వారికి, శరీరంలో ఏ అవయవానికైనా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని అయితే క్యాన్సర్ ప్రాణాంతకమైన వ్యాధి కాదని సర్ సీవీ రామన్ సైన్స్ క్లబ్, కడప డివిజన్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులురెడ్డి అన్నారు. అత్యాధునిక పరీక్షలు క్యాన్సర్ ప్రాథమిక దశలోనే గుర్తిస్తున్నాయని మెరుగైన వైద్య చికిత్స పద్ధతులతో క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ కణాలను శరీరంలో సమూలంగా నిర్మూలించవచ్చని అభిప్రాయపడ్డారు. కడప జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి బాలల వినోదం కార్యక్రమంలో శనివారం సర్‌సీవీ రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షులు శ్రీనివవాసులరెడ్డి విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని తాను రూపొందించిన ఛాయా చిత్రాల ద్వారా వివరించారు. ప్రతి ఒక్కరూ తమ జీవన శైలిలో తగు మార్పులు చేసుకొని సాంప్రదాయక అహారపు అలవాట్లు, సరైన నిద్ర, ప్రాణాయామం, ధ్యానం అవలంభించి, మానసిక ప్రశాంతతతో క్యాన్సర్ దరిచేరనీయకుండా జీవించవచ్చని తన ఛాయా చిత్రాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ సుబ్రమణ్యం, సిబ్బంది సుబ్బమ్మ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎర్రగుడిపాడులో ఘనంగా హనుమాన్ జయంతి



కమలాపురం, జూన్ 1, ప్రభాతవార్త: కమలాపురం మండలం ఎర్రగుడిపాడు గ్రామంలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు గ్రామాల మధ్య ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. వచ్చిన వారికి తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం హోమాలు, పూజలతో పాటు కోలాటం లాంటి సాంస్కృతిక కార్యక్రమాలను కమిటీ సభ్యులు నిర్వహించారు. హనుమాన్ జయంతి వేడుకలకు స్థానిక ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

# కూటమి ప్రభుత్వమే వస్తుంది
## - విశ్వశాంతి సంస్థ అధ్యక్షులు శ్రీ బాల శివ యోగేంద్ర మహరాజ్



కడప వైద్యవిభాగం, జూన్ 1, ప్రభాతవార్త:
చంద్రబాబునాయుడు, పవన్ కల్యాన్ నరేంద్ర మోదీ కలిసి కూటమిగా తలపడుతున్నందున సమిష్టి ప్రారబ్దానుసారం అనుసరించి కూటమికి బలం ఏర్పడి చంద్రబాబు నాయుడు 2024లో ప్రభుత్వం ఏర్పాటు చేయుదురని ఆధ్యాత్మిక తత్వవేత్త విశ్వశాంతి సమస్త అధ్యక్షులు హిందూ మత ప్రచార కర్త పలు విద్యా సంస్థల స్థాపకర్త, శ్రీ బాల శివయోగేంద్ర మహరాజ్ తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ రాబోయేది కూటమి ప్రభుత్వమేనని చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవుతాడని తెలిపారు. భవిష్యవాణిని నేను తెలుపుతున్నాను. బ్రహ్మంగారిమఠంలో 2019 సంవత్సరంలో ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయుదురని అప్పట్లో భవిష్యవాణిని చెప్పడం జరిగిందన్నారు. కనుక ఇప్పట్లో 2024లో కూటమి ప్రభుత్వమే తప్పక వస్తుందని ఆయన భవిష్యవాణిని తెలిపారు.

# సమ్మర్ క్యాంప్ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ



తంబళ్లపల్లె, జూన్ 1, ప్రభాతవార్త:
తంబళ్లపల్లె మండల కేంద్రంలో వాలీబాల్ కోచ్ మహ్మద్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లోని క్రీడాకారులకు స్థానిక ప్రముఖులు (ఔత్సాహికులు) యూనిఫాం వితరణ చేసినట్లు తెలిపారు. శనివారం క్రీడా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు తంబళ్లపల్లెకు చెందిన ఆర్‌ఎంపీ డా.మున్నా, బీబీజే ఫ్యూల్స్ బాషా, నిజాం టెక్స్‌టైల్స్ జహీర్, ఇండియన్ ఆయిల్ ఇలియాస్, నౌషీర్, స్టాంప్ రైటర్ మస్తాన్‌లు యూనిఫాం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనకబడిన తంబళ్లపల్లె ప్రాంతంలో క్రీడాకారుల పట్ల వారి అభిరుచికి అనుగుణంగా క్రీడలను ప్రోత్సహిస్తున్న కోచ్ మహ్మద్ యూసఫ్ కృషి అభినందనీయమని కొనియాడారు. క్రీడాకారుల సైతం భవిష్యత్తులో చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరిచి తమ బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. కోచ్ యూసఫ్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడానికి సహకరించిన ఔత్సాహికులకు కృతజ్ఞతలు తెలుపుతూ రాబోయే రోజుల్లో తంబళ్లపల్లె నుంచి రాష్ట్ర స్థాయికి క్రీడాకారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దాతలను సీనియర్ క్రీడాకారులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు, సమ్మర్ కోచింగ్ క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

# తంబళ్లపల్లె మండలంలో ఘనంగా హనుమజ్జయంతి



తంబళ్లపల్లె, జూన్ 1, ప్రభాతవార్త: తంబళ్లపల్లె మండలంలో హనుమజ్జయంతిని స్థానిక ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని గోపిదిన్నె కొత్తపల్లె, కోటకొండ, గుండ్లపల్లి, కన్నెమడుగు, కోసువారిపల్లె, కుక్కరాజుపల్లి, రెడ్డికోట, ఎద్దులవారిపల్లె, పంచాలమర్రి, జుంజురపెంట, కొట్టాల పంచాయతీలలోని ఆంజనేయస్వామి ఆలయాలలో స్వామి వారికి ఆకుపూజ, అర్చనలు, అభిషేకాలు, దూప దీప నైవేద్యాలు, సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామనామ, సంకీర్తనలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద పెద్దఎత్తున ప్రసాదాలు పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

# సమ్మర్ క్యాంప్‌లో విధ్యార్ధులకు డ్రాయింగ్ షో

ప్రొద్దుటూరు, జూన్ 01, ప్రభాతవార్త: ప్రొద్దుటూరు బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూల్ నందు శనివారం నిర్వహించిన సమ్మర్‌క్యాంప్‌లో విద్యార్థులకు డ్రాయింగ్ షో పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్‌వైమానిక దళ ఏ.ఈ వెంకటకొండయ్య, డ్రాయింగ్ మాస్టర్ సుభాష్‌లు హాజరయ్యారన్నారు. న్యాయనిర్ణేతగా డ్రాయింగ్ మాస్టర్ సుభాష్ వ్యవహరించినట్లు తెలిపారు. ఈపోటీలలో 18మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నిర్మల జ్యోతి, హైస్కూల్ సిబ్బంది రెహ్మాన్ ఖాన్, సారమ్మలు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీశ్రీశ్రీ గాలి దేవర ఆంజనేయస్వామి మహోత్సవం

కడప వైద్యవిభాగం, జూన్ 1, ప్రభాతవార్త:
శ్రీశ్రీశ్రీ గాలి దేవర ఆంజనేయ స్వామి మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. కడప నగరం పాత బస్టాండులో వెలసిన శ్రీశ్రీశ్రీ గాలిదేవర ఆంజనేయస్వామి ఉత్సవాలు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఈశ్వరరెడ్డి, కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు వీవీ చలపతి కమిటీ సభ్యులు బాలాజీ ఆధ్వర్యంలో గురువారం నుంచి శనివారం వరకు అత్యంత వైభవంగా ఉత్సవాలు జరిగాయి. భక్తులందరి సహకారంతో అత్యంత వైభవంగా ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగింది. జూన్ 1వ తేదీ శనివారం ఉదయం మహాభిషేకం అలంకరణ మంత్రపుష్పం, నైవేద్యం సర్వదర్శనం జరిగింది. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. సాయంత్రం బ్రహ్మంగారిమఠం తోటపల్లి అచలానంద ఆశ్రమం పీఠాదిపతి శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి ప్రవచనం జరిగింది. సాయంత్రం 6 గంటలకు గ్రామోత్సవంపై కార్యక్రమాలు అన్నీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది.

# వైభవంగా ప్రసన్న ఆంజనేయస్వామి గ్రామోత్సవం



కడప వైద్యవిభాగం, జూన్ 1, ప్రభాతవార్త: శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి హనుమత్ జయంతి ఉత్సవ గ్రామోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కడప నగరం వక్కలపేటలో శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో హనమాన్ జయంతి ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటలకు స్వస్తి పుణ్యాహవాచనం, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి నిర్వహించడం జరిగింది. తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. దుర్గా మల్లికార్జునరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కీర్తిశేషులు ధర్మకర్త పంజగల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో జరిగింది. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహంతో వక్కలపేట సాయిపేట తదితర ప్రాంతాల్లో గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

# వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు
## మామిడిపండ్లు అలంకరణలో ఆంజినేయస్వామి



మదనపల్లె, జూన్ 1 ప్రభాతవార్త :
పట్టణంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. పలు ఆంజినేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వరాల ఆంజనేయస్వామిని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజారులు మామిడిపండ్లుతో అలంకరణ చేసి భక్తులకు స్వామివారిని దర్శింప చేశారు. పూజలకు విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వందలాదిమంది వరాల ఆంజనేయస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అదే విధంగా నీరుగట్టువారిపల్లె కాట్లాటవారిపల్లె రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలోనూ, రింగురోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం, పిఅండ్‌టి కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో వైభవంగాన పూజలు జరిగాయి. భక్తులు ఆకుపూజల్లో దర్శించుకొన్నారు. శ్రీవారినగర్‌లో వెలిసిన అభయ లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలోని భక్తాంజనేయస్వామిని పలువురు దర్శించుకొని పూజలు చేశారు. పట్టణంలో అప్పారావువీధి, మేధరవీధిల్లోని పలు హనుమాన్ ఆలయాల్లో పూజలు చేశారు. చేనేత నగర్‌లో ఉన్న భక్తాంజనేయస్వామికి వైభవంగా పూజలు చేశారు. హనుమాన్ జయంతి వేడుకలు సందర్భంగా ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

# హనుమత్ జయంతి సంధర్భంగా అన్నదానం

ప్రొద్దుటూరు, జూన్ 01, ప్రభాతవార్త:
సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ తనయుడు చల్లా మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలోశనివారం హనుమత్ జయంతి సందర్భంగా స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ హాల్ సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గత కొన్ని నెలలుగా ప్రొద్దుటూరుపట్టణంలో చల్లా రాజగోపాల్ యాదవ్ ప్రతి శనివారం మరియు పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అన్నదాన కార్యక్రమంలో ప్రయాణికులు,నిరాశ్రయులు, పాదచారులకు ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో అన్నదాన కార్యక్రమానికి మరింత ఆదరణ లభిస్తుంది. ఈ సంధర్భంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నప్రతి ఒక్కరూ తమ సంతృప్తిని వ్యక్తం చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాసయాదవ్, సీతంపల్లి రమణ, జయచంద్ర, నల్లంరవిశంకర్, ఏసునాధరెడ్డి, శివ, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సురేంద్రరెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ద్వారక



రామాపురం, జూన్ 1, ప్రభాతవార్త: మండలంలోని చిట్లూరు పంచాయతీ మునల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు గాలివీటి సురేంద్ర రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్ర చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న తెదేపా సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి శనివారం ఉదయం సురేంద్రరెడ్డిని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో సురేంద్రరెడ్డి త్వరగా కోలుకొని ప్రజాసేవ కొరకు ప్రజల మధ్యకు రావాలని మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి
## - జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



రామాపురం, జూన్ 1, ప్రభాతవార్త: మండలంలోని 14 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమాన్ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయాన్నే ప్రజలు మహిళలు పెద్దఎత్తున ఆలయాల్లో స్వామి వారికి ఆకు పూజ, అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సుద్దమల్ల గ్రామం, ఎర్రమరెడ్డిగారిపల్లెలో హనుమంతునికి నిర్వహించిన అభిషేకం, ప్రత్యేక పూజలలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డిలు పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు




ముద్దనూరు, జూన్ 01, ప్రభాతవార్త:
ముద్దనూరు స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని ఆంజనేయస్వామి దేవస్థానం నందు హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జయంతివేడుకలను శనివారం నాడు ఘణంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆంజనేయస్వామి విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, అర్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలునిర్వహించారు. మధ్యాహ్నం 12గంటల నుంచి ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద పెద్దఎత్తున అన్న సంతర్పన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని భక్తులుభారీ సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించి కాయ కర్పూరాలను సమర్పించి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.

## హనుమత్ జయంతి సందర్భంగా
# హనుమాన్ చాలిసా పారాయణం

పోరుమామిళ్ల, జూన్ 1 ప్రభాతవార్త :
హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శనివారం పోరుమామిళ్లలోనికోదండరామస్వామి ఆలయంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం చేయడం జరిగింది.అలాగే పలు వీధులలో హనుమజ్జయంతి వేడుకలు కన్నుల పండువగా నిర్వహించడంతో మధ్యాహ్నం అన్న ప్రసాదకార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అలాగే సాయంత్రం పలు ఆలయ కమిటి వారు స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్నినిర్వహించారు.



## ఓటమి భయంతోనే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై కోర్టుకు వెల్లడం సిగ్గుచేటు

## నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



పీలేరు, జూన్ 01 ప్రభాతవార్తః

నియోజకవర్గంలోని కలికిరిలో ఓడిపోతారన్న భయంతోనే పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై వైసీపీ నాయకులు కుట్రలు, కుతంత్రాలు మొదలు పెట్టారని తెదెపా జాతీయ ప్రధాన కార్యదర్శి నియోజకవర్గ కూటమి అభ్యర్థి నల్లారికిషోర్‌కుమార్‌రెడ్డి మండి పడ్డారు. ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎన్డీయే కూటమి అభ్యర్థులకు స్వచ్ఛందంగా ఓట్లు వేసి మార్పుకొంటున్నారన్నారు. ఓడిపోతారన్న భయంతో రకరకాలుగా కుట్రలు పన్నుతో ఎన్నికల అధికారులు సీలు, సంతకం లేకపోయినా చెల్లుతుందని ఎలక్షన్ కమిషన్ తేల్చిందన్నారు. ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా వైసీపీ నాయకులు కోర్టుకు వెల్లడం సిగ్గుచేటని కిశోర్‌కుమార్‌రెడ్డి వైసీపీ నాయకులపై విమర్శలు చేశారు. రాష్ట్రంలో వైసీపీ నాయకులు రాజ్యాంగానికి వ్యతిరేకంగా పాటు పడుతున్నారని రాష్ట్రంలో తెదేపా ప్రభంజనం సష్టించి 150 సీట్లు గెలవడం , చంద్రబాబు సీఎం కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి హింసకు తావివ్వరాదు

- శాంతిభద్రతలను కాపాడాలి
- జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్



రాయచోటి, జూన్ 1, ప్రభాతవార్త:

ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి హింసకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శాంతి భద్రతల పరిరక్షణపై రిటర్నింగ్ అధికారులు, డీఎస్పీలతో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, ఎస్పీ కృష్ణారావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎంత మందిపై బైండోవర్ కేసులు విధించారు, రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ తదితర విషయాలపై డీఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలు అవుతోందని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. 133 సెక్షన్ కింద రాళ్లు, కర్రలు లాంటి ఇతరులకు హానీ కలిగించేవి ఎవరూ కలిగి ఉండరాదన్నారు. ఫైర్ క్రాకర్స్ కొనడం, అమ్మడం పూర్తిగా నిషేధమన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఎవరూ ప్రవర్తించరాదన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డా.రాజ్‌కమల్, డీఆర్వో సత్యనారాయణ, ఆర్వోలు, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతమైన కడపలో గృహ నిర్బంధాలు, బహిష్కరణలు దారుణం

- ఆనాడే ఎమ్మెల్యే తమ్ముడిని బహిష్కరించాల్సింది
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి



కడప వైద్యవిభాగం, జూన్ 1, ప్రభాతవార్త:

కడపలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఎన్నడూ గృహ నిర్బంధాలు ఘర్షణలు లేవని, ఈ ఎన్నికల్లో పోలీసులు అత్యుత్సాహం చూపడం దారుణమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం శ్రీనివాసరెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేషన్ వద్ద ఎమ్మెల్యే తమ్ముడు అహ్మద్ బాషా నోటికి వచ్చినట్లు బూతు పదాలు మాట్లాడి దాడి చేసినప్పుడే జిల్లా బహిష్కరణ చేసి ఉంటే కడపలో ఘర్షణ వాతావరణం ఉండేది కాదని పేర్కొన్నారు. పోలింగ్ రోజు ఘర్షణలకు ఎమ్మెల్యే అంజాద్ బాషా ఆయన తమ్ముడు అహ్మద్ బాషా అల్లుడు కారణమని చెప్పారు. ఆయన తమ్ముడు ఒకే ఇంట్లో ఉంటూ ఒకరు వైసీపీ ఎమ్మెల్యేగా, మరొకరు ఇండిపెండెంట్‌గా పోటీ చేయడమేమిటని ప్రశ్నించారు. ఇలాంటి వారికి పాసులు ఇవ్వడం సరికాదని చెప్పారు. ఎన్నికల రోజు పోలలీసులు తీసుకోవాల్సి న జాగరగత్తలు విస్మరించి కౌంటింగ్ రోజు హడావిడి చేయడం హ్యాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లా బహిష్కరణలు కొత్తగా చూస్తున్నామని పేర్కొన్నారు. దీన్ని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికీ వైసీపీ నాయకులకు ఒత్తాసు పలికే పోలలీసులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇలాంటి వారిపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితి కడపలో లేదన్నారు. పోలీస్ 30 యాక్ట్, 144 సెక్షన్, బహిష్కరణలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, జయరాం, రామ్‌ప్రసాద్, రామాంజి, సునీత పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్టాండు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి సిపిఐ నాయకులు డిమాండ్



మదనపల్లె, జూన్ 1 ప్రభాతవార్త :

ఆర్టీసి బస్టాండులో స్వీపర్లను అసభ్య పదజాలంతో అవమానపరిచిన బస్టాండు మేనేజర్ రమణపై చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సిపిఐ నాయకులు మురళి, ముభారక్‌లు వన్‌డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డిను కలసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ వేతనంతో బస్టాండును శుభ్రం చేస్తున్న స్వీపర్లను అవమానపరచడం భావ్యం కాదన్నారు. గతంలో కూడా బస్టాండు మేనేజర్ స్వీపర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడన్నారు. ఆయనపైచర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతంచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు దేవా, తిరుమల, మురళి తదితరులు పాల్గొన్నారు.

## జహాను మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి నాయకులు



నిమ్మనపల్లె, జూన్ 1 ప్రభాతవార్త :

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తరువాత మదనపల్లె టిడిపి అభ్యర్థి షాజహాన్‌బాషాను శనివారం నిమ్మనపల్లె మండల టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల ఫలితాలపై ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మండలంలో పర్యటిస్తానని రాబోయేది మన పార్టీయేనని దీమా వ్యక్తం చేశారు. ఆయనను కలిసిన వారిలో డివి.రమణ, వాసు, రమేష్ తదితరులు కలరు.

## నిమ్మనపల్లె మండలంలో బెట్టింగులు జోరు

నిమ్మనపల్లె, జూన్ 1 ప్రభాతవార్త:

రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు ఎన్నికల ముగిసిన నేపథ్యంలో గ్రామస్థాయి నాయకులు తమ పార్టీనే గెలుస్తుందని ధీమాతో ఉన్నారు. ఇందులో భాగంగా పలు గ్రామాల్లో ఇరుపార్టీల వారు బెట్టింగులు కడుతున్నారు. మండలంలోని పది గ్రామ పంచాయితీల్లోని 25 పోలింగ్ బూతుల్లో ఎన్నికలు జరిగాయి. ఇరుపార్టీల నాయకులు అధినాయకులు వద్ద తామే ఓట్లు వేయించామని తమ పార్టీకే మేజార్టీవస్తుందని దీమా వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీకే మేజార్టీ వస్తుందని నాయకులు ఇదివరకే చెప్పకొచ్చారు. పలుచోట్ల గ్రామాల వారీగా బెట్టింగులు జరిగితే మరికొన్ని చోట్ల మెజార్టీలపై బెట్టింగులు కడుతున్నారు. ఈనెల 4వరకు నాయకులు రకరకాలుగా తమ పార్టీదే పై చేయి అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రంలో కూటమి గెలుపు ఖాయం టిడిపి మండల మాజీ అధ్యక్షులు రాజన్న



నిమ్మనపల్లె, జూన్ 1 ప్రభాతవార్త:

రాష్ట్రంలో కూటమి తిరుగులేని విజయం సాధిస్తుందని అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండల టిడిపి పార్టీ మాజీ అధ్యక్షులు రాజన్న శనివారం తెలిపారు. నియోజకవర్గంలో జరిగిన పోలింగ్‌శాతాన్ని బట్టి ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటుహక్కును వినియోగించుకొన్నారని మదనపల్లె నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి షాజహాన్‌బాషా ఎమ్మెల్యేగానూ, రాజంపేట ఎంపి బిజెపి అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి గెలవడం తధ్యమన్నారు.

## నిమ్మనపల్లెలో ఘనంగా హనుమాన్ జయంతి

నిమ్మనపల్లె, జూన్ 1 ప్రభాతవార్త :

మండల కేంద్రమైన నిమ్మనపల్లెతో పాటు పలు గ్రామాలు హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగాజరుపుకొన్నారు. మండలంలోని బస్టాండు ప్రాంతంలో గల ఆంజనేయస్వామి గుడిలో, హైస్కూల్ వద్దగల ఆంజనేయస్వామి దేవాలయంలో, అక్కాగార్లకట్ట వద్ద హనుమాన్, దిగువపల్లెలో హనుమాన్ జయంతి ఉత్సవాలు జరుపుకొన్నారు. అదే విధంగా చౌకిళ్ళవారిపల్లెలో శ్రీరామ లక్ష్మణుల విగ్రహాలను ఊరేగింపుగా గ్రామస్థులు జరిపారు.

## సీనియర్ టిడిపి నాయకుడు మృతి



రామసముద్రం, జూన్ 1 ప్రభాతవార్త:

మండలంలోని మూగవాడి పంచాయితీ, కొత్తూరు గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పెద్దపాపిరెడ్డి కుమారుడు శంకర్‌రెడ్డి శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఇతని భౌతికాయాన్ని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా సందర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు. శంకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటుగా షాజహాన్‌బాషా అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, గుండాల రామచంద్ర, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు విజయకుమార్‌గౌడ్, మాజీ అధ్యక్షులు కొండూరు నారాయణరెడ్డి, క్రిష్ణంరాజు, రాజేష్, తెలుగుయువత అధ్యక్షులు ప్రశాంత్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

## శ్రీ మందగిరి శనీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

### 101 కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులు తీర్చుకున్న ఎన్డీఏ కూటమి నేతలు శని గ్రహ దోష నివారణకై శనీశ్వరునికి తైలాభిషేకం



సిద్దవటం, జూన్ 1, ప్రభాతవార్త:

కడప చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లి సమీపాన ఉన్న శ్రీ మందగిరి శనీశ్వర ఆలయంలో శనివారం ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాడాలని రాజంపేట నియోజకవర్గం నుండి ఎన్డీఏ కూటమి అసెంబ్లీ అభ్యర్థి సుగవాసి బాల సుబ్రహ్మణ్యం అఖండమైన మెజార్టీతో గెలుపొందాలని శనివారం మందగిరి శనీశ్వర ఆలయంలో శని గ్రహ దోషాల పూజలు ఘనంగా నిర్వహించారు శనీశ్వరునికి వివిధ రకాల నూనెలతో ఆలయ అర్చకులు ప్రధాని నరేంద్రమోడీ, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనసేన రాష్ట్ర నాయకులు పవన్ కళ్యాణ్ నామ గోత్రాల పైన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహణ కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ మాట్లాడుతూ పవిత్రమైన శనివారం రోజున సొద్దవటం మండల ఎన్డీఏ కూటమి నేతలు రాష్ట్రానికి చంద్బాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని శని గ్రహ దోష పూజలు 101 కొబ్బరికాయలు కొట్టడం జరిగిందని రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఎన్డీఏ ప్రభుత్వం రావాలని గత ఐదు సంవత్సరాలుగా వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రం దివాలా కోరు కుంటుందని రాష్ట్రానికి పట్టిన శని పోవాలని కొత్త ప్రభుత్వం రావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షులు పుత్త రామచంద్రయ్య, కార్యదర్శి నాగ మునిరెడ్డి, కుప్పాల వెంకటసుబ్బయ్య కాడే చెంచయ్య నాయుడు మల్లు వెంకట సుబ్బారెడ్డి గంజి సుబ్బరాయుడు ఎన్ఆర్ఐ చంద్ర రాజ నాయుడు రామ్మోహన్ నాయుడు రాజశేఖర్ యాదవ్ పొట్ట శివ నాగభూషణం జింక శివ, మహబూబ్ బాషా(బాబి) బండి ఓబులేసు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బుద్ధిని కొండలో ఘనంగా ధమ్మ పరివర్తన మహోత్సవం



మదనపల్లె, జూన్ 1 ప్రభాతవార్త :

మదనపల్లె రూరల్ మండలం అంకిశెట్టిపల్లె వద్ద ఉన్న బుద్ధునికొండపై శుక్ర, శనివారాల్లో ధమ్మ పరివర్తన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గౌతమ బుద్ధిని జయంతిని పురష్కరించుకొని బుద్ధవిహార, బుద్ధ అంబేద్కర్ సమాజ్‌సంయుక్తంగా ఈ మహోత్సవాలను నిర్వహించారు. బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఈ మహోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి కోర్కెలపై అదుపు కలిగి, నైతిక విలువలతో జీవించి సమాజాన్ని ఆవిష్కరించేందుకు ఉపయుక్తంగా ఉండే ఉన్నతమైన జీవన మార్గాన్ని తదాగతుడు గౌతం బుద్ధుడు అన్నారు. ధర్మ ప్రవర్ధన మహోత్సవాల్లో భాగంగా బోధి వృక్షంను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పూజించారు. భిక్షువులు, ఉపాసకులు త్రిశరణ, పంచశీల పటించి బుద్ధున్ని శరణు వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో కంభం నాగభూషణరెడ్డి, శశిధర్‌రావు, చాట్లబయన్న, నీరుగట్టి రమణ, కెవి.రమణ, గణపతి, తాతయ్య, శ్రీనివాసులు, ముత్యాల మోహన్, కెవి.రత్నం, తలారి క్రిష్ణ, బురుజు చంద్ర, సుమిత్ర, నరసింహులు రమణ, గంగాధర్, బురుజు జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## నిమ్మనపల్లె మండలంలో ఎండ తీవ్రత

నిమ్మనపల్లె, జూన్ 1 ప్రభాతవార్త:

గత వారంరోజులు క్రితం వరకు తీవ్ర ఎండవేడిమికి ఇబ్బందిపడిన ప్రజానీకానికి ఒకటిరెండు రోజుల్లో కురిసిన వర్షం చల్లబడగా తిరిగి గత నాలుగు రోజులుగా ఎండ తీవ్రత పెరిగింది. అంతేకాక ఎండలకు వేడిగాలులు కూడా తోడవడంతో ప్రజలు తల్లడిల్లిపోయారు. భానుడు నిప్పులు కక్కుతున్నాడు. ఉదయం నుంచి భానుడు భగభగ మంటూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 6గంటల నుంచి పదిగంటల వరకే జనాలు రోడ్లపై సంచరిస్తున్నారు. మద్యాహ్నం సమయంలో జనాలు ఇండ్లకే పరిమితం అయ్యారు. ఈ ఎండలకు ఉపాధి కూలీలు కూడా బెంబెలెత్తుతున్నారు. చిన్నారులు కూడా వేసవితాపం తాళలేక అల్లాడుతున్నారు. ఎండలు తీవ్రత వల్ల ప్రయాణాలు కూడా ఆగిపోవడంతో ఆర్టీసితో పాటు ఆటోలు కూడా ఖాళీగా వెలవెలబోతున్నాయి. రాత్రిసమయాల్లో వడగాల్పుల ప్రభావం కనిపిస్తోంది. అత్యధికంగా శీతలపానియాలు, కబ్బరిబొండాలు తాగుతున్నారు. పుచ్చకాయలకు డిమాండ్ పెరిగింది.

## ఇన్‌చార్జ్ ఎంపిడిఓగా భానుప్రసాద్



రామసముద్రం, జూన్ 1 ప్రభాతవార్త :

రామసముద్రం మండల ఇన్‌చార్జ్ ఎంపిడిగో భానుప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నారాయణస్వామి పదవీవిరమణ పొందడంతో మదనపల్లె ఎంపిడిఓ ఉన్న బానుర్రపసాద్‌ను మండలానికి ఇన్‌చార్జ్ ఎంపిడిఓగా బాధ్యతలు అప్పగించారు.

## ఘనంగా హనుమాన్ జయంతి



రామసముద్రం, జూన్ 1 ప్రభాతవార్త:

మండలంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం శ్రీరామ భక్త హనుమాన్ జయంతి వేడుకలు భక్తులు జరుపుకొన్నారు. పలు ఆంజనేయస్వామి ఆలయాలకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. బజారువీధిలోని శ్రీఅంజనేస్వామి ఆలయం, తిరుమలరెడ్డిపల్లె, చెంబకూరు, ఎలకపల్లె, కేసిపల్లె, మినికి, గుంతలపేట, కురిజల, అరికల గ్రామాల్లో వెలసిన హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

## పలు ఆలయాలలో హనుమత్‌జయంతి వేడుకలు

బద్వేలు అర్బన్, జూన్ 1 ప్రభాతవార్త :

పట్టణంలోని పలు ఆలయాలలో శనివారం హనుమాన్‌జయంతిని పురస్కరించి వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగాగాండ్లవీధి, ఆంజనేయనగర్, పోరుమామిళ్ల రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయం, పాతపోస్టాపీసు వీధిలోని ఆంజనేయస్వామి ఆలయం, తదితర వీధులతో పాటు బైపాస్‌రోడ్డులో టి.భాస్కర్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి వివిధ రకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకంతో పాటు పలు రకాలు పూజలు నిర్వహించారు. అలాగే మారుతి భజన మండలి ఆధ్వర్యంలో , సిద్దవటం రోడ్డులోని పలువురు అన్న ప్రసాద కార్యక్రామన్ని నిర్వహించారు. అలాగే అభయాంజనేయస్వామిని అర్బన్ ఎస్ఐ మాడిశెట్టి సత్యనారాయణతోపాటు పలువురు పోలీసు సిబ్బందిస్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటివారు ప్రత్యేక పూజలు చేయించి ప్రసాదాలు అందించారు.



## ఆదిరెడ్డిపల్లి గ్రామంలో రైతు సదస్సు నిర్వహించిన కెవికె శాస్త్రవేత్తలు

### డాక్టర్ వైయస్సార్ విశ్వవిద్యాలయం విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శన



మైదుకూరు రూరల్, జూన్ 1, ప్రభాతవార్త:

కడప జిల్లా మైదుకూరు మండలంలోని ఒనిపెంట, ఆదిరెడ్డిపల్లె, కృషి విజ్ఞాన కేంద్రం తరపున గ్రామీణ ఉద్యాన పని అనుభవ కార్యక్రమంనకు అనంతరాజుపేట ఉద్యాన విద్యాలయం డాక్టర్ వైయస్సార్ విశ్వవిద్యాలయం విద్యార్థులు, ఆదిరెడ్డిపల్లె గ్రామంలో రైతు సదస్సు నిర్వహజంచారు. ఈ కార్యక్రమంనకు అనంతరాజుపేట ఉద్యాన విద్యాలయం కీటక విభాగ అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ రామయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమమునకు కెవికె అధిపతి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం బాలకృష్ణ పరిచయ పలుకులతో ప్రారంభించారు. ఇందులో ఆర్ హెచ్ డబ్ల్యూ ఈ పి కార్యక్రమం గురించి మాట్లాడుతూ మట్టి నమూనా పరీక్షల, నీటి పరీక్షల గురించి వాటి యొక్క ప్రాముఖ్యత, పోషకాల అవ్యశకత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథా డాక్టర్ ఎమ్ రామయ్య మాట్లాడుతూ కార్యక్రమం బాగా నిర్వహించారని, సేంద్రియ వ్యవసాయ ఉపయోగాల గురించి, మిరప, అరటి, పశువుల వచ్చే కీటకాలు, తెగుళ్ల వాటి యాజమాన్యం గురించి వివరిస్తూ అలాగే పంటకి ముందు జనము, జీలుగ, వేసి దున్నుకోవాలని తద్వారా హూమిలో పోషకాలను పెంచుకోవడం గురించి తెలియజేశారు. అలాగే శ్రీనివాసరెడ్డి ఉద్యాన అధికారి పోరుమామిళ్ల మాట్లాడుతూ ఆర్ హెచ్ డబ్ల్యూ ఈపి ప్రతి విద్యార్థి ఉద్యాన జీవితంలో గొప్ప మలుపుగా చెప్పవచ్చు అని అన్నారు. ఉద్యాన విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శన బావుందని తెలియజేశారు. డాక్టర్ దీప్తి కిరణ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనంతరాజుపేట మాట్లాడుతూ ఆర్ హెచ్‌డబ్ల్యూ ఈపి విద్యార్థులు రైతులతో కలిసి కార్యక్రమంలో పాల్గొనడం వల్ల పంట యాజమన్య విధానాలు మరియు సాధక బాధలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉంది అనానరు. డాక్టర్ శ్రీ విద్యా రాణి సీనియర్ శాస్త్రవేత్త, విస్తరణ విభాగం వారు విద్యార్థులు చేసిన కార్యక్రమాలను పద్ధతి ప్రదర్శనల గురించి, వృత్తి విద్య శిక్షణ తరగతులు మరియు రైతులతో చేసిన కార్యక్రమాలను, రైతుల యొక్క సహాయ సహకారాలను కొనియాడారు. డాక్టర్ బి ఎన్‌కాంతి శ్రీ, శాస్త్రవేత్త గృహ విజ్ఞాన విభాగం వారు ఉద్యాన పంటలలో కోత అనంతరం తీసుకోవాల్సి న జాగ్రత్తలు విలువ ఆధారిత పదార్థాలు చేయడం వల్ల రైతులు ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవచ్చని మహిళలు ఈ విషయంలో ప్రధాన భూమిక పోషించారు తెలిపారు. డాక్టర్ ఎన్ ఫిరోజ్ హుస్సేన్ శాస్త్రవేత్త ఉద్యాన విభాగం వారు అరటిలో సిగటాక తెగులు యాజమాన్యం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు నాలుగు నెలల చేసిన కార్యక్రమాల గురించి కరపత్రాన్ని ముఖ్య అతిథి మరియు బృందం వారు ఆవిష్కరించి రైతులకు అందించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, ఆదిరెడ్డిపల్లె, జంగంపల్లి, మరియు లెక్కల వారిపల్లె, గ్రామ రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు మహిళలు పాల్గొని జయప్రదం చేశారు. డాక్టర్ వైయస్సార్ విశ్వ విద్యాలయం విద్యార్థులు గ్రామాల వ్యవసాయంలో పరోక్షంగా ప్రోత్సాహం ఆదిరెడ్డిపల్లె, జంగంపల్లె, మరియు లెక్కలవారిపల్లె, గ్రామ రైతులతో కెవికె శాస్త్రవేత్తలు ఇతర శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో మధ్యలో పలు సమస్యలపై పంటల తెగుళ్లపై యాజమాన్య పద్ధతులపై రైతులతో మాఖాముఖి మాట్లాడడం సమస్యలపై చర్చించడం జరిగింది. అలాగే విద్యార్థుల విషయాల్లో గ్రామాలలో రైతులు మహిళలు చూపిన మంచితనం వారికి సహకారం చూపడంతో విద్యార్థులకు ఎంతో గ్రామీణ వ్యవసాయ విధానం పద్ధతులు వారికి ఎంతో ఉపయోగపడతాయని పలువురు పెద్దలు మాట్లాడడం అలాగే వ్యవసాయ పద్ధతులలో విద్యార్థుల చేత హెక్టార్లలో వ్యవసాయం చేయడం వల్ల విద్యార్థులకు చాలా అనుభవం వస్తుందని విద్యార్థుల అనుభవం మరింత మంచి జరుగుతుందని తెలియజేశారు.

## యువత...ఉద్యోగపర్వం

కామసముద్రం ప్రత్యేకత యుంతరం అక్షర సేద్యం

అట్లూరు, జూన్ 1 ,ప్రభాతవార్త: వ్యవసాయమే జీవన ఆధారమైన అట్లూరు మండలంలోని కామసముద్రం ప్రస్తుతం ప్రత్యేకతను చాటుకుంటుంది ఇది మండలంలో నడిబొడ్డునున్న గ్రామం నాడు అరకు బట్టి బంగారు పంటలు పండించిన రైతులు తమ బిడ్డలకు చదువుల సేద్యం నేర్పించారు ఉన్నత చదువులు చదివించాలనకున్నారు. చదువులతో గ్రామం ముఖచిత్రమే మారిపోయింది. గ్రామానికి చెందిన నేటి యువత ఇతర విశేషాలు ఇతర రాష్ట్రాల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తూ పల్లెకే వన్నె తెచ్చారు. కామసముద్రంలో ఉన్నత పాఠశాల మాత్రమే ఉంది. మిగిలిన చదువులన్నీ పట్టణాల్లో వసతి గృహాల్లో ఉంటూ చదువుకోవాల్సిందే. పెద్దలు ఆరుగాలం కష్టాలను చూచిన రైతు బిడ్డలు చదువులో రాణిస్తున్నారు. కామసముద్రం, వరద రాజుపల్లె, అంబేద్కర్ నగర్‌లో అరుంధతి వాడ, పిచ్చుకుంట కాలనీ, ఎస్టా కాలనీ, మూడువేల జనాభా, 904 మంది ఓటర్లు, 350 కుటుంబాలున్నాయి. అయినా ఈ చిన్న గ్రామం నుంచి 11 మంది డాక్టర్లున్నారు. వీరు అమెరికా, కేరళా, కడప తదితర చోట్ల వైద్యులుగా పేరొందారు. 20 మంది వరకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇతర దేశాలు, బెంగళూరు, హైదరాబాదు తదితర నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. బ్యాంకు ఉద్యోగాల్లో ఇద్దరు, రైల్వేలోఎకరు, లాయర్, పోలీసు ఎఎస్సై, మిలటరీ, టీచర్లు, నర్సు, ఇంజనీర్, సచివాలయం, వ్యవసాయ శాఖాలో, మీడియాలో 30 మంది వరకు బీటెక్ చదువుతున్న విద్యార్థులున్నారు. ఉన్నత చదువులకు దీవెనలందించిన నేలతల్లికి ప్రతి రూపంగా ఏర్పాటు చేసిన అంకాలమ్మకు ప్రతి రెండేళ్లకోసారి గ్రామస్తులు తిరుణాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇదర పట్టాలన్నా, విదేశాలకు వెలలన్నా ఆడ పడుచుల కష్టాలు తీర్చే అంకాలమ్మ వద్ద పూజలు చేయడం ఆనవాయితీ. ఆదుకున్న వ్యవసాయానికి అనుకూలమైన ఏ పంటలునైనా పండించగలరు. విద్యార్థులకు ఉన్నత చదువులు చదివించటానికి లక్షలు ఖర్చుచేశారు. గతంలో కామసముద్రంలో పసుపు. చినితోటలే రైతులను ఆదుకున్నాయి. గ్రామంలో పోటీపోటీగా పంటల దిగుకులు సాదించారు. వానలు సమృద్ధిగా కురిస్తే, గ్రామ సమీపంలోని రెండుచెరువులు సాగకు అండగా ఉన్నాయి. చదువుల్లో రాణించని కొంతమంది 28 మాత్రమే కువైటు జీవనోపాధికి వెళ్లి ఉన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో జొన్న, మామిడిచనూగు, సన్న నిమ్మ, చినిమ్మ, వరి, అక్కడక్కడ దోస, కర్బూజ పంటలు సాగు చేస్తున్నారు. ప్రతి కుటుంబంలో మహిళలు పాలు దిగుబడి ఆదాయంలో పురుషులకు పోటీగా నిలుస్తున్నారు. గతంలో కామసముద్రం గ్రామం అంటే కొట్లాట, గలాటా లో పోలీస్ రికార్డులో మొదటి వరుసలో ఉండేది అది గతం. ప్రస్తుతం పిల్లల చదువుల్లో వ్యవసాయ దిగుబడి లాభాల్లో మండలంలోని మొదటి వరుసలో ఉ్నది శభాష్ కామసముద్రం అంటున్న మండల ప్రజలు.

## ఆచార్య అధ్యాపకుడికి డాక్టరేట్



రాజంపేట అర్బన్, జూన్1 ప్రభాతవార్త

స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగంలో అధ్యాపకులుగా పనిచేస్తున్న పాపుగారి భాస్కర ప్రసాద్ కి జె.ఎన్.టి.యు, అనంతపురం పీ.హెచ్.డీ ప్రధానం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంప్రు మెంట్ ఆఫ్ డైనమిక్ బిహేవియర్ ఆఫ్ సింగిల్ పేజ్ ఇండక్షన్ మోటార్ విత్ రెనివబుల్ ఎనర్జీ సోర్సస్ ఫెడ్ రీబూస్ట్ కన్వర్టర్ విత్ డిప్రంట్ కంట్రోలర్స్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రధానం జరిగిందని తెలిపారు. ఈయన డాక్టర్ ఎం పద్మలలిత, ఈఈఈ విభాగాధిపతి, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, డాక్టర్ పి సుజాత, ప్రొఫెసర్, డైరెక్టర్ ఫారెన్ అఫేర్స్ అండ్ అలమ్నీ మేటర్స్, జే.ఎన్.టీ.యు అనంతపురం వారి ఆధ్వర్యంలో ఈ పీహెచ్.డీ చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ వెల్లడించారు. వీరి పరిశోధన వల్ల పవన ,సౌర విద్యుత్ ను లోడ్ కు ఏ విదంగా కంట్రోల్ చేయాలో తెలుసుకోవచ్చని డాక్టరేట్ పొందిన పాపుగారి భాస్కర ప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, చైర్మన్ డాక్టర్ సి రామచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్ రెడ్డి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎం పద్మలలిత, అధ్యాపక బృందం భాస్కర ప్రసాద్ ను అభినందించారు.

